# సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

**గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే**

**సాక్షి, అమరావతి:** దేశంలో 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే తెలిపారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన దండే మాట్లాడుతూ.. గిరిజనుల్లో ఈ వ్యాధి ఎక్కువగా సంభవిస్తోందన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో 0–40 ఏళ్ల వయసుకు చెందిన 7 కోట్ల మందికి అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించడమే సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో 20 లక్షల మందికి స్క్రీనింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి 86 మంది గిరిజన జనాభాలో ఒకరు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి బారిన పడుతున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళీ అన్నారు. వ్యాధి నిర్మూలన మిషన్‌పై రూపొందించిన పోస్టర్లు, పాంప్లెట్స్‌ను దండే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, ఎయిమ్స్ డీన్ డాక్టర్ శ్రీకాంత్‌కుమార్ పాల్గొన్నారు.